**కథ**

# జై జవాన్

**వి.ఎల్.పద్మసుందరి**

**సాయంత్రం ఐదు గంటల సమయం. ఆఫీసు నుండి వచ్చిన విష్ణుమూర్తి బట్టలు మార్చుకొని మొహం కడుక్కొని రిలాక్స్‌డ్‌గా పడక కుర్చీలో కూర్చుని శాంత ఇచ్చిన కాఫీ గ్లాసు అందుకొంటూ, ఆరిన బట్టలు మడత పెడుతున్న గీతని అడిగారు. "అన్నయ్య ఇంకా స్కూలునుండి రాలేదా?"**

"వచ్చాడు నాన్నా! ఏదో లెటర్ వస్తే ఇప్పుడే వస్తా నంటూ అది తీసుకొని హడావిడిగా వెళ్ళిపోయాడు" చేస్తున్న పని ఆపకుండా చెప్పింది గీత.

"మధ్యాహ్నం మాధవరావుగారు కబురుచేశారు. రాజేష్ ఇంకో ఇరవై రోజుల్లో వెళ్ళిపోవాలిట. పెళ్ళి ఏర్పాట్లు ఎంతవరకు వచ్చాయో చెప్పమన్నారు" శాంతి చెప్పింది.

"ఆ ప్రయత్నంలోనే ఉన్నాను. ఆఫీసులో అన్నిరకాల లోన్స్‌కి అప్లయ్ చేశాను. ఎందుకైనా మంచిదని ఊళ్ళో పొలాన్ని కూడా బేరం పెట్టమని బాబాయికి కబురుచేశాను. ఒకటా రెండా, పదిలక్షలు పోగవ్వాలంటే, అదీ నెల రోజుల్లో మాటలా?" విసుక్కొన్నాడు విష్ణుమూర్తి.

"బావుంది. అలాగని చూస్తూ చూస్తూ, అమెరికా కుర్రాడిని వదులుకుంటామా?" సాగదీసింది శాంత.

గీతకి వాళ్ళ సంభాషణ ఇబ్బందిగా ఉంది. కుటుంబాన్ని ప్రేమించే ఏ నగటు ఆడపిల్లా తన పెళ్ళికోసం కన్నవాళ్ళు అప్పులపాలవ్వాలని కోరుకోదు. గీత అందుకు అతీతురాలు కాకపోయినా ఆడపిల్ల పెళ్ళి కన్నవాళ్ళ బాధ్యతగా భావించి మిన్నకుండిపోయింది.

కాస్త దూరంలో నీరెండలో కూర్చుని వత్తులు చేసుకొంటున్న యశోదమ్మ మాత్రం కొడుకు, కోడలి సంభాషణ వింటూ చిన్నగా నిట్టూర్చింది. 'అందని ఆశలకు పరుగులు పెట్టడం, ఆపై ఆయాసంతో చతికిలపడడం నేటి కాలపు రివాజుగా మారింది. ఉన్న కొడుకు, కూతుళ్ళనిద్దరిని దేశాలు, ఖండాలు దాటించి పంపేసి వీళ్ళు పొందే ఆనందం ఏముందీ?' తనలోతాను గొణుక్కుంది.

అదే సమయంలో చేతిలో స్వీటు బాక్స్‌తో వచ్చాడు రఘు.

"నాన్న, అమ్మ, గీత, బామ్మా అంతా ఇక్కడే ఉన్నారా? వెరీగుడ్.. మీకో గుడ్‌న్యూస్ స్వీట్ తీసుకోండి" బాక్స్ ఓపెన్ చేసి మొదటి స్వీటు తండ్రికి అందిస్తూ చెప్పాడు.

"నువ్వేం చెప్పనక్కరలేదు. నేను చెబుతాను. నీకు యు.ఎస్. వెళ్ళడానికి వీసా శాంక్షన్ అయ్యింది అవునా?" విష్ణుమూర్తి నవ్వుతూ అడిగాడు.

"ఊహూ! మీ ఊహ తప్పు" తల అడ్డంగా ఊపాడు రఘు.

"నేను చెప్తాను అన్నయ్యా" గీత దగ్గరికి వచ్చి స్వీటు తీసుకొని "నీకు అమెరికన్ యూనివర్సిటీలో సీటు కన్‌ఫమ్ అయ్యింది కదూ!" అడిగింది.

"సారీ! యు ఆర్ రాంగ్" చెల్లెలి తలపై చిన్నగా తట్టి దగ్గరికి రాని బామ్మకి ఇచ్చేందుకు తనే వెళ్ళి ప్రక్కన కూర్చున్నాడు.

"ఆ! నాకర్థమయ్యిందండీ...అమెరికాలో ఏదైనా కంపెనీలో ఉద్యోగం వచ్చినట్లు చూపిస్తే త్వరగా వీసా వస్తుందని మా తమ్ముడు చెప్పాడుగా! వాడే కాలిఫోర్నియాలో ఏదో ఉద్యోగం చూసి వీడికి చెప్పి ఉంటాడు. ఏరా అంతేనా?" శాంత చిరునవ్వుతో కొడుకునడిగింది.

"అబ్బబ్బా! ఏమిటి మీరంతా? అమెరికా వెళ్ళడమే జీవిత ధ్యేయంలా మాట్లాడతారు. మీరనుకునేది ఏదీ కాదు. నాకు బి.ఎస్.ఎఫ్‌లో జాబ్ వచ్చింది. రెండురోజుల్లో వచ్చి ట్రయినింగ్ క్లాసెస్‌లో జాయిన్ కమ్మని ఆర్డర్ వచ్చింది" జేబులో నుండి బి.ఎస్.ఎఫ్ అఫీషియల్ ముద్ర ఉన్న బ్రవున్ కవర్ తీసి చూపిస్తూ చెప్పాడు.

ఏమాత్రం ఊహించని షాక్ తిన్నట్లు ఉండిపోయారు ముగ్గురూ. యశోదమ్మ మాత్రం తడబడుతూ మనవడి చేతిలోంచి కవరు తీసుకొని అందులోని కాగితాలు ఆప్యాయంగా తడమసాగింది. నిర్జీవమైన ఆ కాగితాలలో ఆమెకు నలభై ఏళ్ళ క్రితం స్వాతంత్ర్య పోరాటానికి సర్వస్వాన్ని ధారపోసి అశువులు బాసిన భర్తని, ఆరేళ్ళనాడు కార్గిల్ పోరులో ప్రాణత్యాగం చేసిన చిన్నకొడుకు సూర్యాన్ని గుర్తుచేసి అప్రయత్నంగా ముడతలుపడిన కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.

తల్లి ఫీలింగ్స్ పట్టించుకోని విష్ణుమూర్తి వదనం గంభీరంగా మారింది.

"మాకు తెలియకుండా నువ్వు సెలక్షన్స్‌కి ఎప్పుడెళ్ళావు?"

"లాస్ట్‌మంత్. కాకినాడలో జరిగితే నా ఫ్రెండ్ వంశీ వెళుతూ నన్నూ రమ్మన్నాడు. ప్రయత్నించి చూద్దాం అని వెళ్ళాను. నేను క్వాలిఫై అయ్యాను. పాపం వాడు ఫెయిల్ అయ్యాడు" నవ్వాడు రఘు.

రెండు క్షణాల మౌనం తర్వాత చెప్పాడు విష్ణుమూర్తి.

"వస్తే వచ్చింది. నువ్వేం జాయిన్ అవ్వనక్కరలేదు."

భర్త ఎక్కడ ఒప్పేసుకుంటాడోనని టెన్షన్‌గా చూస్తున్న శాంత రిలాక్స్‌గా ఊపిరి పీల్చుకుంది.

రఘు మాత్రం నమ్మలేనట్లు చూశాడు. "ఎందుకని?"

"ఎందుకేమిటీ? ఆ మిలట్రీ ట్రయినింగ్‌లు నువ్వు తట్టుకోలేవు. పైగా వీసాకి అప్లయ్ చేసి ఈరోజో రేపో అబ్రాడ్ వెళ్ళడానికి ఛాన్స్ వస్తుంటే పోయి పోయి మిలట్రీలో జాయినవ్వడం ఏమిటి?" చిరాగ్గా అడిగాడు.

రఘు తండ్రికి దగ్గరగా వచ్చాడు. "వీలైతే అబ్రాడ్ వెళ్ళాలనుకున్నమాట నిజమే. కానీ అదేం నాకు ఫైనల్ గోల్ కాదు. దేశానికి సేవ చేసే ఇంత మంచి అవకాశం వదిలేసి విదేశాలకి వెళ్ళాలనే కోరిక నాకేం లేదు" ఖచ్చితంగా చెప్పాడు.

"ఏమిటి నువ్వు చేసే దేశసేవ" విసురుగా లేచాడు విష్ణుమూర్తి. "ఈ ఇంటి నుండి నా తండ్రి, మీ చిన్నాన్నా కూడా దేశం దేశం అంటూనే ముప్ఫై ఏళ్ళు నిండకుండానే మట్టిలో కలిసిపోయారు. నిన్ను కూడా ఈ మట్టికి బలిచెయ్యాలనే కోరిక నాకు లేదు" ఆగ్రహంగా అన్నాడు.

"నాకిష్టమై నేను వెళతానంటే మీకేమిటి అభ్యంతరం" విసుక్కొన్నాడు రఘు.

"ఆ! నీ ఇష్టాలు ఎంత నవ్వుమైనవో నాకు తెలియక పోతే కదా! ఎమ్.కామ్ చదివి ఎయిడెడ్ టీచర్‌గా రెండేళ్ళుగా ఎలిమెంట్రీ స్కూల్లో పడి ఏడుస్తున్నావు. నా పాట్లు నేను పడి నిన్ను విదేశాలకి పంపిస్తానంటే నిత్యం ఛస్తూ బ్రతుకుతానంటావు. ఇదేగా నీ ఇష్టం" పచార్లు చేస్తూ అసహనంగా అడిగాడు.

రఘులో ఆగ్రహం పెరగసాగింది. "నాన్నా! ఉన్న స్థాయి నుండి ఉన్నతస్థాయికి వెళ్ళాలని అనుకున్నాను కానీ అదీ దేశాన్ని దాటి వెళితేనే సాధ్యమని నేను ఏనాడు అనుకోలేదు. అయినా గీతకి ఎన్ఆర్ఐని కుదిర్చి ఎలా పెళ్ళి చేసి పంపాలా అని సతమతమౌతున్న మీరు నన్ను కూడా పంపడం ఎంత కష్టమో ఆలోచించారా?! నేనేం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌నో, ఎమ్.సి.ఏనో కాదు, పిలిచి ఉద్యోగాలు ఇవ్వడానికి. ఆఫ్టాల్ కామర్స్ పోస్టుగ్రాడ్యుయేట్‌ని. నన్ను విదేశాలకు పంపేందుకు ప్రతీ రూపాయి మీరే అమర్చవలసి ఉంటుంది. ఇవన్నీ ఆలోచించారా?" నిలదీశాడు.

"నేను నీ తండ్రిని. నాకన్నీ తెలుసు. నువ్వు ఇక్కడే చిన్నా చితకా ఉద్యోగాలు చేసుకుంటూ చాలీచాలని బ్రతుకు వెళ్ళదీయడం, మిలట్రీలో చేరి నువ్వు అక్కడ ఎలా ఉన్నావో అని ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని బ్రతకడం...ఇవన్నీ భరించడం నావల్ల కాదు. నిన్ను పంపేందుకు అవసరమైతే నేను ఇల్లు కూడా అమ్మేస్తాను.

నువ్వు,
గీతా సుఖపడితే నేను, అమ్మ, బామ్మ బ్రతకడానికి నాకొచ్చే జీతం చాలు. దిసీజ్ మై ఫైనల్ డెసిషన్. దట్సాల్'' చెప్పదలచుకున్నది స్పష్టంగా చెప్పి వినేదేం లేనట్లు వెళ్ళిపోయాడు విష్ణు మూర్తి. తండ్రి నిర్ణయానికి హతాశుడైన రఘు సపోర్టు కోసం తల్లి వైపు తిరిగి-

''ఏమిటమ్మా నాన్న! మరీ ఇంత సిల్లీగా ఆలోచిస్తు న్నారు. నువ్వయినా చెప్పమ్మా?'' తల్లిని రిక్వెస్ట్ చేశాడు.

''రఘూ..! మీ నాన్న నిర్ణయం ఏదైనా ఆలోచించే తీసు కుంటారు. నువ్వు ఆయన చెప్పినట్లు వినడమే మంచిది'' వాదాన్ని పెంచకుండా తేల్చి చెప్పింది శాంత.

''అన్నయ్యా! మిలట్రీ అంటేనే ప్రాణాలకి రిస్క్ జాబ్. అమ్మ నాన్నలకున్నది నువ్వు ఒక్కడివే. నీకేదైనా అయితే వాళ్ళు తట్టుకోలేరు. డాడీ మాట వినడమే మంచిదనిపి స్తోంది'' రఘు అడక్కుండానే సలహా ఇచ్చింది గీత.


ఎటూ తేల్చుకోలేని అయోమయానికి గురౌతూ నీర సంగా వచ్చి యశోదమ్మ ప్రక్కన కూలబడ్డాడు రఘూ.

ఏ లోకంలో ఉందో యశోదమ్మ అప్పుడే తేరుకున్నట్లు మసకబారిన కళ్ళతో రఘు తలని తడిమి దొరక పుచ్చు కుని చెంపలు సవరించి నుదురు చుంబిస్తూ ''రాఘవా! నువ్వు, మీ తాతయ్యా చిన్నాన్నల్లా దేశానికి సేవ చేసేందుకు సిద్ధపడడం నాకు చాలా సంతోషంగా ఉంది నాన్నా.. ఇంతకీ ఎప్పుడు వెళ్తున్నావు చేరడా నికి?'' ఆప్యాయంగా అడిగింది.

ఏం బదులు చెప్పాలో తెలియ నట్లు నిస్సహాయంగా చూసిన రఘు, సమాధానం చెప్పలేనట్లు ఆమె ఒడిలో తల దాచేసుకున్నాడు.

* * *

రఘుతో చెప్పడమైతే కరి నంగా చెప్పివచ్చేశాడు కానీ ఏ మూలో ఎదిగిన పాతికేళ్ళ కొడుకు తన మాటను గౌరవి స్తాడా? అన్న భయం మన సులో పీకుతుంటే, దానిగురించే ఆలోచిస్తూ సిగరెట్లు తగలేస్తుంటే వచ్చాడు అతని బాల్యమిత్రుడు రాజారాం.



''సారీ రా! చాలాసేపటినుండి వెయిట్ చేస్తున్నావా?'' వస్తూనే అడిగాడు ఎదురుగా కూర్చుంటూ.

''అబ్బే లేదురా! నేను ఇప్పుడే వచ్చాను'' సిగరెట్ పారేసి సద్దుకున్నాడు.

''అర్జెంటుగా పార్కుకి రమ్మని ఫోన్ చేశావెందుకు?''

''మరేం లేదు రాజు! మా గీత పెళ్ళి సెటిల్ అయ్యింది కదా! ఉన్న సేవింగ్స్‌తో కట్నం, ఫంక్షన్ హాల్, కేటరింగ్ ఇలా కొన్నింటికి అడ్వాన్స్‌లు ఇచ్చేశాను. అయినా ఇంకా ఐదారులక్షలు కావలసివస్తోంది. పెళ్ళేమో పదిహేనురో జులు కూడా లేదు. నీ సహాయం కోసం మాట్లాడదామని రమ్మన్నాను. ఇక్కడైతే స్థిమితంగా మాట్లాడుకోవచ్చని రమ్మన్నాను'' సంజాయిషీగా చెప్పాడు విష్ణుమూర్తి.

ఇబ్బందిగా కదిలాడు రాజారాం. ''విష్ణూ! నా పరిస్థితి నీకు తెలియంది కాదు. మా కుర్రాడు ఈమధ్యే టెక్సాస్ వెళ్ళాడు. నా భార్యకి గుండె జబ్బు. ప్రస్తుతం ఆర్థికంగా నేను ఏమీ సహాయపడలేనురా!''

విష్ణుమూర్తికి మనస్సు చివుక్కుమంది. 'ఈ మధ్యనే ఏమిటీ చందు టెక్సాస్ వెళ్ళి ఏడాదిన్నర అయ్యింది. రెండుచేతులా ఆర్జిస్తూ వేలకి వేలు పంపుతున్నాడు. అప్పులన్నీ ఎప్పుడో తీర్చేసి, ఇప్పుడు నాకెక్కడ ఇవ్వాలో అని బీదరుపులు అరుస్తున్నట్లున్నాడు' మనసులో తిట్టు కొంటూ పైకి మాత్రం ''అబ్బే! నీ సంగతి నాకు తెలి యదా? అదేం కాదురా! ఆమధ్య నువ్వు చందూని టెక్సాస్ పంపడానికి డబ్బు అవసరపడి మైలారంలోని నీ ప్లాటు ఏదో రియల్ ఎస్టేట్ ద్వారా పది రోజుల్లో అమ్మేశానన్నావు కదా! ఆ అడ్రస్‌కి తీసుకెళితే నాకు కాకి నాడ అవుట్ స్కర్ట్స్‌లో దాదాపు పది పదిహేను లక్షలు చేసే భూములు ఉన్నాయి. వాటిని అమ్మేద్దామని అనుకుంటున్నాను'' చెప్పాడు.

రాజారాం కొన్ని నిమిషాలు ఆలోచించి, '' గీత పెళ్ళికో సమే కదా! కుర్రాడి గురించి బాగా ఎంక్వయిరీ చేశావా?'' ప్రశ్నించాడు.

''కుర్రాడి వివరాలు పక్కాగానే ఉన్నాయిరా! కాలిఫోర్ని యాలో ఉండే మా బావమరిది కంపెనీలోనే రాజేష్ కూడా చేస్తున్నాడు. అతను అన్నీ కూపీలాగి మాకు చెప్పాడు. కాకపోతే రాజేష్ కేవలం పెళ్ళి చేసుకుని వెళ్ళేం

దుకే శెలవుపెట్టి ఇండియా వచ్చాడు. అందుకే నాకీ డబ్బు వత్తిడి. అది మాత్రమే కాదనుకో. నీకు తెలుసుగా. మా రఘు ఎమ్.కామ్ చదివీ ఎలిమెంట్రీ స్కూల్లో చేస్తున్నాడు. ఎలాగో అలా వాడినీ అమెరికా తోసేస్తే సుఖంగా బ్రతుకుతాడని నా ఆశ" సిగరెట్ వెలిగిస్తూ చెప్పాడు.

"ఒరేయ్! ఆడపిల్ల అంటే అమెరికా అయినా, అనకాపల్లి అయినా అత్తింటికి వెళ్ళవలసిందే కనుక అంత దూరం చేస్తున్నావంటే అర్థం ఉంది. ఉన్న ఒక్క కొడుకునీ ఖండాలు దాటించి పంపేయడం ఎందుకురా? ఇక్కడే గట్టిగా ప్రయత్నిస్తే కాస్త మంచి ఉద్యోగం దొరకదా!" మందలిస్తున్నట్లు అడిగాడు.

విష్ణుమూర్తి కనుబొమలు ఒకసారి ముడిపడి అంతలోనే విడిపోయాయి.

"ఒరేయ్ రాజు! ఈ మాట నువ్వు అనడం చాలా విచిత్రంగా ఉందిరా! నాకే కాదు నీకూ ఒక్కడే కొడుకు. అయినా నువ్వు అప్పు చేసి మరీ వాడిని టెక్సాస్ పంపావు. నాకేమో నీతులు చెబుతున్నావు. రూపాయి విలువకి డాలర్ నలభై రెట్లు ఎక్కువురా!" హేళనగా అన్నాడు.

ఒక్కక్షణం రాజారాం మొహం నల్లగా మాడిపోయింది. తనకి తానుగా విష్ణుమూర్తి చేతిలోని సగం కాలిన సిగరెట్ అందుకొని పీలుస్తూ-

"నిజం విష్ణు. నేనే నిన్ను నాలా తొందరపడద్దని వారించగలను. ఎందుకంటే ఉన్న ఒక్కబిడ్డని డాలర్ల మోజులో దేశాలు దాటించి పంపేసి ఆ బిడ్డ పలికే మాట కోసం, ఒక్కసారి కళ్ళారా చూసుకోవడం కోసం కన్నవాళ్ళు పడే నరకాన్ని నేను ప్రత్యక్షంగా అనుభవిస్తున్నాను కనుక నా స్నేహితుడిగా నిన్ను హెచ్చరించగలను. వారించగలను" నిర్లిప్తంగా అన్నాడు.

"రాజా! ఏం మాట్లాడుతున్నావు?" ఆశ్చర్యం ధ్వనించింది విష్ణుమూర్తి స్వరంలో.

రాజారాం మెల్లగా గడ్డిలో వెనక్కి వాలి, మిణుకు మిణుకు మంటూ పుట్టుకువస్తున్న తారలని చూస్తూ చెప్పసాగాడు. "విష్ణు, ఈకాలం పిల్లల్లాగే మా చందూ ఇంజనీరింగ్ పూర్తికాగానే హయ్యర్ స్టడీస్‌కి అబ్రాడ్ వెళ్తానని సిటీకి వెళ్ళే ప్రయత్నాలు చేసుకున్నాడు. ఒక ప్లేస్‌మెంట్ సంస్థ టెక్సాస్ యూనివర్సిటీలో వెయ్యి డాలర్లు నెలకి స్టూడెంట్ ఎయిడ్ ఇస్తుందని నమ్మించి మాచేత లక్షలు ఖర్చు చేయించి పిల్లాడిని పంపేందుకు ప్రోత్సహించింది. తీరా, వీడు అక్కడికి వెళ్ళాకా మా యూనివర్శిటీ అలాంటి ఎయిడ్ ఏమీ ఇవ్వదు. ఇష్టం లేకపోతే మరోచోట చూసుకోమన్నారుట. ఉన్న అవకాశం వదులుకోలేక, తిరిగి ఇండియా రాలేక, తనలాంటి మరో నలుగురు ఇండియన్స్‌తో షేర్ చేసుకుంటూ అక్కడే ఉండిపోయాడు. కేవలం ఇండియన్ డిగ్రీతో ఉద్యోగం దొరకడం అసాధ్యం. ఏదైనా అమెరికన్ యూనివర్సిటీ గుర్తింపు తప్పనిసరి. అందుకే పాపం వెర్రి వెధవ పగలు చదువుకుంటూ తీరిక వేళల్లో పబ్స్‌లో, గేస్ స్టేషన్స్‌లో, స్టోర్స్‌లో పనిచేస్తూ వాడి పాట్లు వాడు పడుతున్నాడు. పోనీ, నేనేమైనా పంపుదామా అంటే, నా జీతం వాడిని పంపేందుకైన అప్పులు తీర్చడానికి, నా భార్య గుండె జబ్బు వైద్యానికే సరిపోతోంది. వాడు టెక్సాస్ వెళ్ళి ఏడాదిన్నర. ఇంకో ఏడాది గడిస్తే కానీ చదువుకి గుర్తింపు, సరైన ఉద్యోగం రాదు. ఈ బాధలకి తోడు ఇప్పటికే నా భార్యకి రెండుసార్లు గుండెనొప్పి వచ్చింది. మరోసారి వస్తే బ్రతకడం కష్టమంటున్నారు డాక్టర్లు. చందూని ఒక్కసారైనా కళ్ళారా చూడకుండానే చనిపోతానేమోనని దాని భయం. ఎప్పుడైనా చందూ ఫోన్ చేస్తే ఒక్కసారి రమ్మని చెప్పాలనిపిస్తుంది. కానీ.. తాగిన కాఫీ కప్పు కూడా సింక్‌లో వెయ్యడం అలవాటు లేని చందూ, ఫీజులకి, బ్రతకడానికి ఎంగిలి కప్పులు ఎత్తుతూ అడ్డమైన చాకిరీలు చేస్తూ నానాపాట్లు పడుతుంటే, లక్షలు తగలేసి వచ్చి వెళ్ళమని కోరే ధైర్యం లేక కన్నతల్లి పరిస్థితి చెప్పకుండా దాచేస్తున్నాను.

మరో సమస్య ఏమిటో తెలుసా విష్ణు...స్టూడెంట్ వీసామీద వచ్చినవాళ్ళు గేస్ స్టేషన్లలో పనిచెయ్యడం అక్కడ చట్టరీత్యా నేరం. ఏనాడైనా దొరికిపోతే, వీసా కేన్సిల్ చేసి జైలుశిక్ష విధించే ప్రమాదం కూడా ఉందిట. ఇవన్నీ తెలిశాకా అర్థమయ్యింది, డాలర్ల మోజులో చందూని అంత దూరం పంపి ఎంత తప్పు చేశానో. ఇప్పుడనిపిస్తోంది. చందూ ఇక్కడే ఉంటే, వాడి చదువుకి పదివేల డాలర్ల బదులు పదివేల రూపాయలే వచ్చినా కష్టంలో ఓదార్పునిచ్చే కన్నవాళ్ళు ప్రక్కనే ఉండేవాళ్ళం. ఇల్లు, ఆస్తీ ఉన్నదేదో దానితో సుఖంగా బ్రతికేవాళ్ళం. ఎదిగిన కొడుకుని దూరం చేసుకొని ఇలా నిత్యం నరకం పడే హింస తప్పేది అని.." చెబుతుండగానే రాజారాం కనుకొనల నుండి జారిన నీళ్ళు గడ్డిలో పడి ఇంకిపోయాయి.

వింటున్న విష్ణుమూర్తికి గుండె పిండినట్లయ్యింది. రాజారాంని లేపి కూర్చోపెట్టి భుజం తట్టి ఓదారుస్తూ ఉండిపోయాడు. ఐదు నిముషాల తర్వాత తేరుకున్న రాజారాం కర్చీఫ్‌తో కళ్ళు ముక్కు తుడుచుకుని, "సారీరా! చందూ ప్రసక్తి వస్తే నా మనసు అదుపులో ఉండదు" సంజాయిషీగా అన్నాడు.

విష్ణుమూర్తి బదులు చెప్పలేదు.

"విష్ణు, నేను ఇదంతా నిన్ను బెదిరించాలని, నీ బిడ్డ భవిష్యత్తుకి అడ్డుపడాలని చెప్పలేదు. నాస్థాయి, తాహతూ చూసుకోకుండా, ఆ యూనిర్శిటీ గురించి సరైన ఎంక్వయిరీ చెయ్యకుండా చందూని పంపి నేను పొరపాటు చేశాను. మీ బావమరిది అక్కడే ఉంటున్నాడు కనుక నువ్వు జాగ్రత్త పడవచ్చు. కాకపోతే ఒక్క బిడ్డ. రేపు మనకేదైనా జరిగినా చివరి చూపుకి కూడా రాలేని పరిస్థితిలో ఉంటేనే బాధాకరం. సరే, మనం రేపు ఆ రియల్ ఎస్టేట్ వాళ్ళ దగ్గరికి వెళదాం. మరి నే వెళ్తాను. నా భార్యకి మందులిచ్చే టైమయ్యింది" భుజం తట్టి చెప్పి హడావిడిగా వెళ్ళిపోయాడు రాజారాం.

చాలాసేపు ఏది మంచో, ఏది చెడో అంచనా వేసుకుంటూ ఉండిపోయాడు విష్ణుమూర్తి.

* * *

ఆ రాత్రి భోజనాల దగ్గర మరోసారి రఘుని కదిపాడు విష్ణుమూర్తి.

"రఘూ! ఏం నిర్ణయించుకున్నావు?"

కూర కలుపుకుంటున్న రఘు ఒక్కక్షణం ఆగి తండ్రికేసి సూటిగా చూసి "నా నిర్ణయంలో మార్పేం లేదు నాన్న. పక్కింట్లో కూలికి వెళ్ళి వంద తెచ్చుకోవడం కన్నా నా ఇంట్లో తోట పనిలో వచ్చే పది రూపాయలే నాకిష్టం. అందులో నాకు రెండు ఆనందాలు ఉన్నాయి. ఒకటి నా ఇల్లు శుభ్రం చేసుకున్నాననే సంతృప్తి. రెండు నా శ్రమకు తగిన ఫలాన్ని పొందిన సంతోషం" సూటిగా చెప్పాడు.

"బాగా ఆలోచించావా?" రెట్టించాడు విష్ణుమూర్తి.

రఘు పూర్తిగా తినడం ఆపేశాడు. "నాన్నా! నా వే ఆఫ్ థింకింగ్ మంచిదో చెడ్డదో నాకు తెలియదు. కానీ, అమెరికా ఇండియా కన్నా ఎన్నోరెట్లు గొప్పది కావచ్చు. ఆర్థికంగా, వ్యక్తిగతంగా ఉన్నతుల్ని చెయ్యడానికి, అక్కడ చాలా అవకాశాలుండవచ్చు. అలాగని మిమ్మల్ని, ఇండియాని వదిలేసి వెళ్ళి ఇంటర్‌నెట్‌లో తెలుగు పేపర్ చదువుతూ, ఇండియన్ రెస్టారెంట్లో భోజనం చేస్తూ ఎప్పుడో ఆగస్టు 15కి, జనవరి 26కి టివిలో వచ్చే జండావందనంలో ఫ్లాగ్‌కి సెల్యూట్ చేసి మేరా భారత్ మహాన్ అని గర్వపడడం. మీరు ఈ-మెయిల్లో పంపే పిల్ల ఫోటో చూసి, మనిషి నాకు నచ్చింది కట్నం మీకు నచ్చితే వచ్చి మూడుముళ్ళు వేసి మూడోరోజు తీసుకుపోయి నేను ఎక్కడున్నా నా ఆత్మ మీ చుట్టూ తిరుగుతూ ఉంటుందని సోకాల్డ్ డైలాగులు చెప్పడం నా వల్ల కాదు."

"ఇంక మీ సందేహాలు. మిలట్రీలోకెళితే చచ్చిపోతాను అంటారా? పోనీ, మిలట్రీకి వెళ్ళనంతమాత్రాన ఏమీకాదనే గ్యారంటీ ఏమైనా ఉందా? లేదుగా! నా చదువు, తెలివి, శక్తి నా దేశానికి నా వాళ్ళకి వినియోగించకుండా పిరికివాడిలా వచ్చిన అవకాశాన్ని కాలదన్నుకోవడం జరగని పని. ఈ విషయంలో నా నిర్ణయం మార్పులేనిది. మిమ్మల్ని నొప్పిస్తే ఐయాం సారీ" తల్లినీ, తండ్రిని మార్చి మార్చి చూస్తూ చెప్పదలుచుకున్నది క్లియర్‌గా చెప్పి సగంలోనే చెయ్యి కడుక్కుని వెళ్ళిపోయాడు రఘు.

"అదేమిటండీ, వాడంత మూర్ఖంగా మాట్లాడిపోతుంటే, మీరూ మౌనంగా ఉండిపోయారు" కంగారుగా విష్ణుమూర్తిని కుదిపింది శాంత.

"తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడానికి, తొందరపడడానికి రఘు వివేకం లేని పసివాడు కాదు. వాడి మాటల్లోనూ వాస్తవం ఉంది. నేనూ- రఘు నిర్ణయాన్ని అభినందిస్తున్నాను" గంభీరంగా చెప్పాడు.

తండ్రి తీర్పు కోసం వేచి చూడని రఘు, తిన్నగా యశోదమ్మ గదిలోకి వెళ్ళి కళ్ళు మూసుకొని తాళం తిప్పుతున్న ఆమె పక్కన కూర్చుని చెప్పాడు.

"బామ్మా! నేను రేపే బి.ఎస్.ఎఫ్.ట్రయినింగ్‌కి వెళ్తున్నాను"

గాజుగోళీల లాంటి కళ్ళు తెరిచి మనవడి మాటల్ని చెవులారా వింటూ చేయెత్తి రఘు తలకాన్చి దీవించి చెప్పింది "జై జవాన్!"